నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-తలమడుగు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి చెందడంతో పాటు ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని సుంకిడి గ్రామ సమీపంలోని షఫీ స్టోన్ క్రషర్ మూలమలుపు వద్ద శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ధనశ్రీ తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం మహారాష్ట్ర పిప్పల్‌గావ్ గ్రామానికి చెందిన గుర్నులే అంకుష్, బెందారే గోపాల్, గుర్నులే ఈశ్వర్ ఎంహెచ్ 26 బీఎస్ 6732 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై ముగ్గురు కలిసి మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ గ్రామం నుంచి సుంకిడి గ్రామం వైపు వస్తుండగా షఫీ స్టోన్ క్రషర్ సమీపంలో ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపుగా వెళుతున్న మ్యాక్స్ వాహనం ఎంహెచ్ 29 బిఈ 6441 అను నెంబరు గల వాహన డ్రైవర్ చెంబెడి సంజయ్ అతివేగంతో అజాగ్రత్తగా మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనలో అంకుష్, గోపాల్, ఈశ్వర్‌లకు కాళ్ళు విరగగా 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో గోపాల్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహారాష్ట్రకు తరలిన ఏనుగు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



నాలుగు రోజుల పాటు వణుకుపుట్టించిన ఏనుగు మహారాష్ట్రకు వెళ్లిపోయిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. శనివారం మండలంలోని మురళీగూడ గ్రామ సమీపంలో గల ప్రాణహిత నది పరివాహక ప్రాంతంలో బెజ్జూరు, పెంచికల్‌పేట్ రేంజ్ అటవీ శాఖ సిబ్బంది నది పరివాహక ప్రాంతంలో ఏనుగు కాలి ముద్రలు చూసి దానిని ట్రాక్ చేశారు. ఇలా ప్రాణహిత నది అవతలివైపు ఏనుగు కాలిముద్రలు కనిపించినట్టు, ప్రాణహిత నది దాటి అక్కడున్న మహారాష్ట్ర అడవిలోకి వెళ్లినట్టు నిర్ధారించినట్టు రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు. మహారాష్ట్ర అటవీ శాఖ సిబ్బందితో ఏనుగు వచ్చినట్టు సమాచారం అందించామని, వారు కూడా ఏనుగు వచ్చినట్టు నిర్ధారించినట్టు తెలిపారు.

తాగునీరు లేదు..నిలువ నీడ కరువు..!

- ఎండ వేడికి ఉపాధి కూలీల విలవిల
- పని ప్రదేశాల్లో కనిపించని సౌకర్యాలు
- మూడేండ్ల నుంచి నిలిపివేసిన కరువు భత్యం
- నిరుపేద కూలీల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

సూర్యుడి భగభగలతో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు అల్లాడిపోతున్నారు. తాగేందుకు నీళ్లు లేక..సేదతీరేందుకు నిలువ నీడ కరువై అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గత వారం రోజుల నుంచి 43డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇంట్లో ఉన్నా వేడి గాలులకు తట్టుకోలేకపోతున్న తరుణంలో ఇక ఎండలో పనులు చేస్తున్న వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేలాది కుటుంబాలు రోజువారీగా ఉదయమే పనులకు వెళ్తున్నారు. ప్రస్తుతం ఉదయం..సాయంత్రం రెండు పూటలా పనులు చేపడుతున్న కూలీల ఫోటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉండటంతో రోజంతా ఇదే పనిలో నిమగ్నం కావాల్సి వస్తోంది. ఈ తరుణంలో పని ప్రదేశాల్లో వివిధ రకాల సౌకర్యాలు కల్పించాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా దృష్టిసారించడం లేదు. ఫలితంగా ఉపాధికూలీలు ఎండవేడిమి భరించలేక ఇబ్బందులు పడాల్సివస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్ రూరల్

వేసవిలో వ్యవసాయ పనులు ఉండకపోవడంతో వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవి. ఈ సమస్యను అధిగమించేందుకు అప్పటి ప్రభుత్వం 2005లో ఉపాధిహామీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రజలకు వేసవిలో పని కల్పించి ఆర్థికంగా అండదండలు అందించాలని భావించింది. ఈ తరుణంలో ఉపాధిహామీ కింద సుమారు 52 రకాల పనులను చేపట్టేందుకు వీలు కల్పించింది. చెరువు మట్టి పూడికతీయడం, పంట పొలాల్లో రాళ్లకట్టలు, నీరు వెళ్లిపోయేందుకు కాల్వలు తవ్వడంతో పాటు వివిధ రకాల పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 6.50లక్షల మంది కూలీలు ఈ పనులకు వెళ్తున్నారు. కేంద్రప్రభుత్వం ఇటీవల రోజు సగటు కూలీ కొంత పెంచి రూ.300 వరకు పెంచింది. దీంతో ఆయా కుటుంబాలు వేసవికాలంలో ఈ పనులకు వెళ్తూ ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా గడుపుతున్నారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

సౌకర్యాలు లేక ఇబ్బందులు..!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని ప్రదేశాల్లో కూలీలకు కచ్చితంగా వివిధ రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. తాగునీరు, నీడ కోసం టెంట్ సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచాలి. వీటితో పాటు గడ్డపార, తట్ట తదితర సౌకర్యాలు కూడా కల్పించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం అనేక పని ప్రదేశాల్లో ఈ సౌకర్యాలు కనిపించడం లేదు. ఎండలు మండిపోతుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటిని ఇంటి నుంచి తెచ్చుకుంటుండగా.. నీడలో సేదతీరేందుకు కోసం తీవ్రంగా తిప్పలు పడాల్సి వస్తోంది. మరోపక్క జనవరి నుంచి మే నెల వరకు చేసిన పనులను కరువు భత్యం రూపంలో అదనంగా డబ్బులు చెల్లించాల్సి ఉండగా గత మూడేండ్ల నుంచి కేంద్రప్రభుత్వం తొలగించింది. దీంతో కూలీలు ఎండలోనే పనులు చేస్తూ అనారోగ్యానికి గురవుతున్నా ప్రభుత్వాలు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. గతంలో నీడ కోసం షామియానాలను పంపిణీ చేసేవారు కానీ ప్రస్తుతం అవి ఎక్కడా కనిపించని పరిస్థితి ఉంది.




ఉమ్మడి జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు ఇవి

జిల్లా	పంచాయతీలు	జాబ్‌కార్డులు	ఉపాధికూలీలు
ఆదిలాబాద్	468	1,14,636	2,16,957
నిర్మల్	396	1,30,772	2,32,654
ఆసిఫాబాద్	336	93,385	1,73,545
మంచిర్యాల	310	84,196	1,44,897

తాగునీటిని సరఫరా చేస్తున్నాం

సాయన్న, డీఆర్‌డీఓ, ఆదిలాబాద్



ఉపాధిహామీ పనులు చేపడుతున్న కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఓఆర్‌ఎస్ పొట్లాలు, అవసరమైన మందులను పని ప్రదేశాలకు సరఫరా చేస్తున్నాం. ఆయా పంచాయతీల ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. కరువు భత్యాన్ని ప్రభుత్వమే నిలిపివేసింది.

ఎలాంటి సౌకర్యాలు లేవు

వైద్యానాథ్, ఉపాధికూలీ



పని ప్రదేశంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. తాగేందుకు నీటిని ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. నీడ కోసం షామియానాలు లేవు. గడ్డపారలు కూడ ఇవ్వడం లేదు. ఎండలోనే పనులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం తీవ్రమైన ఎండలు ఉండటంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి.


సమస్యలు ఎలుగెత్తడంలో మీడియా పాత్ర గొప్పది



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాసమస్యలు ఎలుగెత్తడంలో మీడియా పాత్ర వెలకట్టలేనిదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రారంభోత్సవంలో జెడ్పీటీసీ నాగేశ్వరరావు, జిల్లా నాయకురాలు సరస్వతితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మీడియా ప్రతినిధులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై శ్రద్ధ తీసుకోనున్నట్లు వివరించారు. ప్రజా సమస్యలు ఎలుగెత్తడంలో మీడియా పాత్ర ఎంతో గొప్పదన్నారు. వివిధ మీడియాలో పనిచేస్తున్న రిపోర్టర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలీబిన్ అహ్మద్, నిసార్, మీడియా ప్రతినిధులు రవి నాయక్, మహేష్, వేణుగోపాల్, కృష్ణంరాజు, సురేష్, శ్రీధర్, నితీష్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రాజు, ఖలీల్, చందు, సాయి, రాందాస్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

ఎన్నికల డ్యూటీ రద్దు.. పరీక్షల కోసం పడిగాపులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల విధులు కేటాయించిన ఉపాధ్యాయులు అధ్యాపకులు వివిధ ఆరోగ్య సమస్యల నేపథ్యంలో డ్యూటీ రద్దు కోసం దరఖాస్తు చేసుకోగా వారికి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో చేసిన పరీక్షల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే మే 13న జిల్లాలో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు డ్యూటీలను కేటాయిస్తూ కలెక్టర్ ఆర్డర్లు జారీ చేశారు. అయితే వీరిలో సగటున 140 మంది వివిధ రకాల ఆరోగ్య సమస్య నేపథ్యంలో రద్దు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరి ఆరోగ్య సమస్య తీవ్రత తెలుసుకోవడానికి జిల్లా వైద్యాధికారి నేతృత్వంలో ఒక కమిటీ వేసి వారి రిపోర్టు ఆధారంగా కలెక్టర్ విధుల రద్దు చేయడమా లేదా అనేది నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని సందేశం పంపించారు. దీనితో పరీక్షల నిమిత్తం కొంత మంది మొదట కలెక్టరేట్‌కు వచ్చి అక్కడి నుండి ప్రధాన ఆస్పత్రికి చేరుకున్నారు. గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్‌తో పాటు ఇతర పరీక్షలకు వచ్చిన వారికి వేరువేరుగా డాక్టర్లు పరీక్ష చేసినప్పటికి గర్భిణీలు కొంత ఇబ్బంది పడ్డారు. పరీక్షలు చేసిన వైద్యులు రిపోర్టు వెల్లడించకపోవడంతో దానికోసం ఎన్నికల సిబ్బంది ఎదురుచూడాల్సి వస్తుంది. జిల్లా కలెక్టర్ విధులకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

లైబ్రరీలో పాఠకులకు పూర్తి స్థాయి సౌకర్యాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పత్రికలు, స్టడీ మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడంతో పాటు వేసవి దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయంలో పూర్తి సౌకర్యాలు కల్పించాలని, అభ్యర్థులకు అవసరమయ్యే టేబుల్, రైటింగ్ పాడ్స్, పుస్తకాలు సమకూర్చాలని గ్రంథాలయ అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రంథాలయంలో ఇన్వర్టర్ సమకూర్చాలని, తాగునీటితో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అవసరమైన పుస్తకాలు, పత్రికలను ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, గ్రంథాలయ అధికారులు సదానందం, సతీదేవి, వెంకటరమణ, రాములు, సలీం, పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతల ఆధారంగా పనులు చేపట్టాలి

నవతెలంగాణ-జైపూర్

అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల పరిధిలో ఎవ్వరికి వారుగా స్వీయ రక్షణ చర్యలు చేపడుతూ పనుల నిర్వాహణ కొనసాగించాలని మండల ప్రత్యేక అధికారి, పశు సంవర్థక శాఖ జేడీ రమేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ వజనా రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి శనివారం రైతు వేదికలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన వేసవిలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై చర్చించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెంచడంతో పాటు ఎండ వేడిని దృష్టిలో పెట్టుకుని పనులు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పరిధిలో నీటి ఎద్దడిని గుర్తించాలని తెలిపారు. నీటి సమస్య ఎదురైనప్పుడు స్థానిక వసతులకు తోడు అవసరమైన సందర్భంలో నేరుగా నీటిని సరఫరా చేయించాలని తెలిపారు. జూన్ 30 వరకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, తప్పని సరిపరిస్థితుల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ బోరు బావుల నుండి నీటిని సమకూర్చేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

'ఏనుగు వెళ్లిపోయింది.. అయినా అప్రమత్తంగా ఉండాల్సిందే..'

- జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్ టిబ్రేవాల్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఛత్తీస్‌ఘడ్ నుండి మహారాష్ట్ర మీదుగా ప్రాణహిత నది దాటి ఈ నెల మూడో తేదీన జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు తిరిగి మహారాష్ట్ర వెళ్లిపోయిందని, అయినా ప్రాణహిత సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్ టిబ్రేవాల్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్‌లోని అటవీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఛత్తీస్‌ఘడ్ నుండి ఏనుగులు మహారాష్ట్ర అడవుల్లోకి ప్రవేశించి, అటు నుండి అటే వెళ్లిపోయాయని, కాని మన జిల్లాలోకి ప్రవేశించి భీభత్సం సృష్టించడం ఇదే ప్రథమమన్నారు. ప్రస్తుతం ఈ ఏనుగు మహారాష్ట్రలోకి ప్రవేశించినట్లు అక్కడి అటవీ అధికారులు కూడా ధృవీకరించినట్లు తెలిపారు. ఇక ముందు ఏ వన్యప్రాణులు జనావాసాల్లోకి వచ్చినా వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఏనుగు సురక్షితంగా మహారాష్ట్రకు తరలివెళ్లడంలో అందరి కృషి ఉందన్నారు. తమ శాఖ సిబ్బందితో పాటు రెవెన్యూ, పోలీసు శాఖలు పూర్తిగా సహకరించాయని కొనియాడారు.

అటవీ సిబ్బందికి శిక్షణ

కాగా రాబోయే రోజులలో ఏనుగులు మళ్లీ జిల్లాకు వస్తే వాటి కదలికలను గుర్తించి, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా చేసేందుకు గాను జిల్లాలోని అటవీ సిబ్బందికి శనివారం కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాకు చెందిన అటవీ అధికారులతో స్థానిక అధికారులకు, సిబ్బందికి ఈ శిక్షణ ఇచ్చారు.



మాట్లాడుతున్న డీఎఫ్ఓ నీరజ్ టిబ్రేవాల్



స్థానిక అటవీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న మహారాష్ట్ర అటవీ అధికారి

రిమ్స్‌లో అన్నదానం



నవతెలంగాణ- ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ అన్నదానం నిర్వహించారు. ఆయన మాతృమూర్తి దర్శనాల చిన్నక్క రెండో వర్ధంతి సందర్భంగా శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి ఆవరణలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రారంభించారు. అన్నదానం చేసిన మల్లేష్‌ను ఆయన అభినందించారు. పలువురు రోగుల బంధువులు, ఆసుపత్రికి వచ్చిన సందర్శకులు భోజనం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ అమ్మ పేరున పేదలకు అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఎం.గంగన్న, రిమ్స్ యూనియన్ నాయకులు దేవిదాస్, పొచ్చన్న, రమాకాంత్, న్యూడెమోక్రసీ నాయకులు వెంకట్‌నారాయణ, మున్సిపల్ యూనియన్ నాయకులు మెరుగు జనార్దన్, రిమ్స్ ఉద్యోగుల సంఘం నాయకులు బి.మల్లయ్య, ప్రశాంత్, వ్యకాస నాయకులు కె.ఆశన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మౌళిక వసతుల కల్పనపై నివేదికలు అందజేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీచే పాఠశాలలో మౌళిక వసతుల కల్పనపై సదుపాయాలను క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, ఫైనల్ ఎస్టిమేషన్ నివేదికలు త్వరగా అందజేయాలని కలెక్టర్ రాజర్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, ఈఈ, పీఆర్, ఈఈ ఆర్ అండ్ బి, ఎంఏయూడీ, ఆర్‌డబ్ల్యుఎస్, ఈడబ్ల్యూఐడీసీ, డీఈఓ అధికారులతో కలిసి సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు అవసరమైన పాఠశాలలను సందర్శించి, నిర్వహించాల్సిన పనుల ఫైనల్ ఎస్టిమేషన్‌ను రూపొందించి వెంటనే పంపాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్ మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల పర్యవేక్షణ పనుల వ్యయ అంచనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి పక్కాగా ప్రతిపాదన రూపొందించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారానే పూర్తి చేయాలన్నారు. పాఠశాల మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏయే పాఠశాలలో ఏయే పనులు చేపట్టాలో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాల్సిందిగా కోరారు. జిల్లాలో ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు త్వరగా సమర్పించాలని తెలిపారు.

మున్సిపాలిటీ ఆధార్ కేంద్రం సందర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపాలిటీ కార్యాలయంలోని ఆధార్ సేవ కేంద్రాన్ని జిల్లా మేనేజర్ రవి శనివారం సందర్శించారు. ఇటీవల కొత్త మున్సిపాలిటీ భవనంలోకి మార్చబడ్డ మున్సిపల్ బిల్డింగ్‌లో ఉన్న కార్నే భాస్కర్ ఆధార్ కేంద్రాన్ని సందర్శించి, తగు సూచనలు తెలియజేశారు. జెండర్ చేంజ్, డేట్ ఆఫ్ బర్త్, అడ్రస్, నేమ్ చేంజ్, ఈమెయిల్ ఐడీ చేంజ్ కొరకు రూ.50 వరకే తీసుకోవాలని అన్నారు. అలాగే పూర్తి అప్‌డేట్ అనగా అన్ని వేలిముద్రలతో పాటు ఐరిస్ స్కాన్ చేసుకున్నట్లయితే రూ.100 ఉంటుందని తెలిపారు. ఐదు (5) నుంచి ఏడు(7) సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకి ఆధార బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా ఉంటుందని తెలిపారు. సిటిజన్‌కి ఏమైనా సమస్యలు ఉంటే 1947 టోల్ నెంబర్‌కి నేరుగా కాల్ చేయాలని సూచించారు. ఈ సర్వీసును మైఆధార్.యూఐడీఏఐ.గావ్.ఇన్ సైట్‌లో ప్రూఫ్ ఆఫ్ అడ్రస్, ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ 14 జూన్ 2024 వరకు ఉచితంగా ఫ్రీ సర్వీస్ డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉందని తెలిపారు.



రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-బోథ్

రైతులు పండించిన జొన్న పంటలను ప్రభుత్వమే పూర్తిగా కొనుగోళ్లు చేయాలని శనివారం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి శ్రమించి ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రైతులు పండించిన జొన్న పంటను ఎకరానికి 8.85 కిలోలు మాత్రమే కొనుగోళ్లు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పరిమితి తొలగించి జొన్న పంటలను పూర్తిగా కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. అసలే పండించిన పంటలకు దిగుబడి రాక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మిగిలిన పంటలకు ప్రయివేటు వ్యాపారస్తులకు అమ్ముకొని రైతులు నష్టపోతారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లెపూల సుభాష్, బుచ్చన్న, రాయల్, రామారావు, నరేందర్, రమణగౌడ్, భీమ్‌రావు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

వడదెబ్బపై ప్రత్యేక దృష్టి సారించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



రోజు రోజుకు పెరుగుతున్న భానుడి ప్రతాపం వల్ల ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అదనపు వైద్యాధికారి డా.కుడ్మేత మనోహర్ అన్నారు. ఆయన శనివారం ఈశ్వర్ నగర్‌లోని సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. గర్భవతులు, బాలింతల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోను డెలివరీలు ఇంటివద్ద చేయకూడదన్నారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీని సందర్శించారు. వెల్‌నెస్ సెంటర్ నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్ఓ సందీప్, హెచ్ఈఓ తులసీదాస్, హెచ్ఏ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

రబీ ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



రైతులు పండించిన వరిధాన్యానికి ప్రభుత్వం ఈ సీజన్ నుంచే క్వింటాకు రూ.500 బోనస్‌గా ఇవ్వాలని బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జీ బుక్యా జాన్సన్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత బస్‌స్టాండ్ ప్రాంతంలో ఆపార్టీ నాయకులు, రైతులతో కలిసి దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులకు నీటి కష్టాలు ఎదురైనాయని అన్నారు. పంటలు ఎండిపోయి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఎన్నికల్లో ప్రకటించినట్లుగా ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాము నాయక్, శ్రవణ్, శ్రీనివాస్‌రెడ్డి, కారింగుల సుమన్, కె.శ్రీనివాస్, బీసీ. రాజన్న, విక్రమ్ నాయక్, గజేంధర్, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు, చిన్నారులకు టీకాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలో అంకోలి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని చిచ్‌దరి ఖానాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని హత్తిగుట్ట, మారుగూడ, బోరింగ్‌గూడ, కొలం గిరిజన గ్రామాల్లో శనివారం గర్భిణులకు, చిన్నారులకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహించామని డాక్టర్ సర్పరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మర్సకొల లక్ష్మీబాయి, బొమ్మెత సుభాష్, హెల్త్ అసిస్టెంట్స్ పవార్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ నారాయణ, సత్యవతి, శైలజ, ఆశాలు లక్ష్మీ, అరుకుబాయి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు వేగవంతం చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

అమ్మ ఆదర్శ పాఠశాలలు 2023-24 కింద మంజూరైనా పనులు తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మత్తులు పాఠశాలలో విద్యుత్ తదితర అంశాలపై శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్న పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ శేఖర్, ఎంఈఓ నారాయణ, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్, ఎంపీఓ వినోద్, ఏపీఎం స్వామి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వీఓ గ్రూపుల అధ్యక్షులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

8న కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈనెల 8న మూడు నియోజకవర్గాల బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం నిర్వహిస్తున్నట్టు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ సెల్ జాతీయ అధ్యక్షులు కొప్పుల రాజు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గానికి చెందిన బూత్ ఏజెంట్లు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని, 33కెవీ బంగారిగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదిలాబాద్ మండలంలోని బంగారిగూడ, పిప్పల్దరి, అంకోలి, సాత్నాల సబ్ స్టేషన్ల పరిదిలో ఉదయం 7:00 గంటల నుంచి 11 : 00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పై సబ్ స్టేషన్ల పరిదిలోని వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. శనివారం మావల మండల కేంద్రం నుంచి తుక్కుగూడ బహిరంగ సభకు బయదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉంటుందని, సాధారణ ఆదివాసీ ఆడ బిడ్డను గుర్తించి అధిష్టానం పార్లమెంట్ అభ్యర్థిత్వాన్ని ఇచ్చిందన్నారు. అందుకే మనం తెలంగాణ తల్లీ సోనియా గాంధీకి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించి బహుమతిగా ఇచ్చి, రాహుల్ గాంధీని ఈ దేశ ప్రధాన మంత్రిగా చేసేందుకు కృషి చేయాలని అన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, గిరిజన సహకార సంస్థ కోఆపరేటివ్ చైర్మన్‌గా పని చేసినప్పటికీ ఆదిలాబాద్ జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు కాంగ్రెస్ అధిష్టానం రెండు సార్లు ఎమ్మెల్యేగా, అసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చి గెలిపిస్తే కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి వెన్నుపోటు పొడిచారని అన్నారు. గోండు బిడ్డలకు ఎమ్మెల్యేగా ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆత్రం సుగుణను ఆదరించి, అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీటీ రణదీవె ఆశయాలను కొనసాగిద్దాం

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక ఉద్యమ నాయకుడు సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవె ఆశయాలను కొనసాగిద్దామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్ అన్నారు. శనివారం ఆయన 34వ వర్ధంతిని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ కార్మిక ఉద్యమ నాయకులు సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీఆర్ 1990 ఏప్రిల్ 6న అనారోగ్యంతో కన్ను మూశారని అన్నారు. అందుకోసమే 34వ వర్ధంతిని కార్మిక వర్గం అతనికి ఘనంగా నివాళులర్పిస్తుందని తెలిపారు. బీటీఆర్ ఒక గొప్ప సిద్ధాంత వేత్త ఆలోచనపరుడు మేధావి అని కొనియాడారు. పోరాట యోధుడు మార్క్సిజం లేని నిజం వంటబుచ్చుకొని కార్మిక పోరాటాలను ఉధృతం చేసిన మహా గొప్ప మేధావి అన్నారు. శ్రామిక మహిళలని సంఘటితం చేయడంలో మనలో ఉన్న అవ లక్షణాలను పురుషాధిక్యత సమాజం ఫీడల్ భావజాలానికి వ్యతిరేకంగా స్త్రీలను చిన్నచూపు చూపిన పోరాటం చేసి కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి, దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, సీఐటీయూ జిల్లా కమిటి సభ్యులు అగ్గిమల్ల స్వామి, నాయకులు మల్లికాంబ, ప్రియంక, శోభ, భోజమ్మ పాల్గొన్నారు.

నిర్మల్ : కార్మిక ఉద్యమ నాయకుడు సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవె ఆశయాలను కొనసాగిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో బీటీ రణదీవే 34వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదీవె 1990 ఏప్రిల్ 6న అనారోగ్యంతో కన్ను మూసిన రోజు అన్నారు. అందుకోసమే 34వ వర్ధంతిని కార్మికవర్గం అతనికి ఘనంగా నివాళులు అర్పిస్తుందన్నారు. బీటీఆర్ ఒక గొప్ప సిద్ధాంత వేత్త, మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోశెట్టి, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుజాత, డివిజన్ కార్యదర్శి కమల, నిర్మల్ డివిజన్ నాయకులు సుగుణ, ముధోల్ డివిజన్ అధ్యక్షులు ఇంద్రమాల పాల్గొన్నారు.





విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, చేపట్టనున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని 672 పాఠశాలలలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రతి పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, తాగునీరు, విద్యుత్ సదుపాయం, విద్యుత్ బిల్లు తగ్గించుటకు సౌర పలకాల ఏర్పాటు వంటి వాటిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా తీర్మాణాలు చేసి పనులను చేపట్టాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాలలో మహిళా సమాఖ్య అధ్యక్షులు, పట్టణాలలో పట్టణ సమాఖ్య అధ్యక్షులు చైర్మన్‌గా ఉంటారని తెలిపారు. ప్రతి కమిటీ పేరు మీద బ్యాంక్ ఖాతా తెరవాలని సూచించారు. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడం, అవసరమైన వసతుల కల్పనకు ప్రణాళికలు తయారు చేయడం, రోజువారీ హాజరు సమీక్ష, మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, ఆర్థిక వనరులను సక్రమంగా వినియోగించేలా చూడటం, వంటి పనులపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలలలో మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాలలో ఈజీఎస్ కింద, పట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీలా ఆధ్వర్యంలో చేపట్టాలని అన్నారు. చేపట్టిన పనులను నాణ్యత ప్రమాణాలను పాటించి, పూర్తి చేయాలనీ సూచించారు. పనుల ప్రారంభానికి ముందు, తర్వాత నివేదికలతో పాటు ఫోటోలను సమర్పించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధిలో ఏఎల్ఎఫ్, ఎస్‌హెచ్‌జీ సభ్యులను భాగస్వాములుగా చేసి, గుణాత్మక విద్య లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రవీందర్‌రెడ్డి, డీఆర్డిఓ విజయలక్ష్మి, సీపీఓ బాబురావ్, జెడ్పీ సీఈఓ గోవింద్, అధికారులు అశోక్ కుమార్, శంకరయ్య, సంతోష్, ఎంపీడీఓలు, ఎంఈఓలు, మహిళా సమాఖ్య సభ్యులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈనెల 14వ తేది లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం స్వీప్ ఆధ్వర్యంలో ఇందిరాప్రియదర్శిని స్టేడియం నుంచి జిల్లా పరిషత్ వరకు నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతిని వెలిగించి, ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 14వ తేది వరకు ఓటరుగా నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 1వ తేది వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుల ఫార్మ్ నెంబర్ 6 వివరాలు నమోదు చేసి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు కొత్తగా ఓటర్ నమోదు కొరకు అందజేయాలని తెలిపారు. అంతేకాకుండా ఆన్‌లైన్ దరఖాస్తు యాప్‌లో తమ తమ ఆధార్ కార్డు లేదా ఎస్ఎస్‌సీ మార్క్ మెమో ఆధారంగా కొత్త ఓటర్ల కొరకు నమోదు చేసుకోవచ్చుని పేర్కొన్నారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో తప్పకుండా పాల్గొని తమ ఓటును తమ కుటుంబ సభ్యులు ఓటును వినియోగంచుకోవాలని తెలిపారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వారితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ, డివైఎస్ఓ, డీఎంహెచ్ఓ, రిమ్స్ డైరెక్టర్, డీడబ్ల్యూఓ, ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు, మావల మండల అధికారులు, అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, మేడికోలు, మెప్మా, ఆర్పీఎస్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మెంబర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-తాంసి



మండలంలోని పాలోడి గ్రామానికి చెందిన రాయల పోశెట్టి రైతు గత కొన్ని రోజుల కింద పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గ్రామ మాజీ సర్పంచ్ శంకర్‌తో కలిసి రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు చేసుకోవడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను, మృతుని భార్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు తాను సాగుచేస్తున్న సొంత వ్యవసాయ భూమి ఆరున్నర ఎకరాలతో పాటు మరో 6 ఎకరాలను కౌలుకి తీసుకొని సాగుచేస్తున్న సందర్భంలో వ్యవసాయానికి చేసిన అప్పులు అధికం కావడం, వాస్తవంగా గత రెండు మూడు సంవత్సరాల నుండి అతివృష్టి, అనావృష్టి ఉండటంతో తాను ఆశించినంత పంట దిగుబడి రాక పోవడంతో మానసికంగా కుంగిపోయి పంటకు పెట్టిన పెట్టుబడులు ఎలా తీర్చాలోనని, మానసికంగా కుంగిపోయి తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కుటుంబానికి రైతు భీమాతో పాటు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీఓ నెం.194 ప్రకారంగా ఆరు లక్షల రూపాయల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కుటుంబ యజమానురాలికి నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని, వీరి పిల్లలకు ఉన్నతమైన విద్య, వైద్య ఉపాధి అవకాశాలు ఇతర సదుపాయాలు అందించాలని, వ్యవసాయ రంగంలో అతి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే విధంగా, చిరుదాన్యాలను పండించే విధంగా కృషి చేయాలనీ, ప్రతి రైతుకి నెలసరి ఆదాయం రూ.15వేల ఆదాయం వచ్చే విధంగా ఆకు కూరగాయల ఇతర పంటల సాగును ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, రైతులు ఆశన్న, ఆశారెడ్డి ఉన్నారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరాను వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సీఎంఆర్ సరఫరా, లక్ష్యాలు తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కస్టమ్ మిల్లింగ్ రైస్ 2023-24 సంవత్సరం సీఎంఆర్ లక్ష్యాలను వేగవంతంగా చేయాలని సంబంధిత మిల్లర్లను ఆదేశించారు. నిరంతరం మిల్లింగ్ చేయాలని, ఈ నెల 10 లోపు పూర్తీ చేయాలనీ సూచించారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై రిపోర్టులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిలర్ల వారిగా లక్ష్యం, పూర్తిచేసిన సీఎంఆర్ సరఫరా, పెండింగ్ పై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, డీఎస్ఓ సంధిత, డీఎం సివిల్ సప్లై శ్రీకళ, తహసీల్దార్లు, అధికారులు, మిల్లర్లు, పాల్గొన్నారు.

పెండ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

పెండ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని న్యూకాలనీలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జాదవ్ జ్ఞానేశ్వర్(21) పెండ్లి కావడం లేదని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు గత కొంతకాలంగా పెండ్లి చేసుకోవాలని పెండ్లి సంబంధాలు చూస్తున్నాడు. అలాగే ఉగాది పండుగ తర్వాత చేస్తామని చెప్పినా వినిపించుకోలేదు, పెండ్లి కావడం లేదని మనస్తాపంతో శనివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి జాదవ్ సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రెండు లక్షలు, హెల్పర్లకు లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలన్నారు. 60 ఏండ్లు నిండిన వారికి వీఆర్ఎస్ తీసుకునే సౌకర్యం కల్పించాలని కోరారు. ఆమె వెంట సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఈజీఎస్ ఏపీఓ రజనీకాంత్ తల్లి శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పంద్రా జైవంత్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి మృతిపట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎంపీపీ వెంట నాయకులు ఉన్నారు.

ఎండాకాలం జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఎండాకాలం నేపథ్యంలో గర్భిణులు జాగ్రతలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో గుంజాల సబ్‌సెంటర్ పరిదిలోని 15 గ్రామాలకు సంబంధించిన 40 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్స్ వేయించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది హిమ బిందు, చౌహాన్ చరణ్‌దాస్, విద్యారాణి, సరిత, సారిక, ఆశాలు జ్యోతి, సంగీత, ఛాయా, లక్ష్మీబాయి ఉన్నారు.

అభిప్రాయాలను సేకరించడానికే టిఫిక్ బైటక్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాబోయే ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్ నుంచి 50 శాతానికి పైగా ఓట్లు సాధించే దిశగా కార్యాచరణ చేసేందుకు కార్యకర్తల నుంచి నాయకుల నుంచి సలహాలు వారి వారి అభిప్రాయాలను టిఫిన్ బైటక్ ద్వారా సేకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీని సంస్థగతంగా పటిష్టపరిచేందుకు టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 274వ పోలింగ్ బూత్‌లో నిర్వహించిన బైటక్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీకి లేనటువంటి కార్యకర్తల బలం బీజేపీ పార్టీకి ఉందన్నారు. నిబద్ధత దేశభక్తి క్రమశిక్షణ ఇవి పార్టీ కార్యకర్తల లక్షణాలని అన్నారు. కేవలం పార్టీలోనే బూత్ స్థాయి కార్యకర్త ఇచ్చే సలహాలు కూడా పరిగణలోకి తీసుకోబడుతుందని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర పార్టీకి, కేంద్ర పార్టీకి పంపించి వాటిని అమలుపరిచే దిశగా ప్రయత్నాలు చేస్తామని అన్నారు, బూత్ స్థాయిలో ఓట్లు సాధించే బాధ్యత బూత్ కార్యకర్తలది, నాయకులదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, ఆధినాథ్, ముకుంద్, ప్రవీణ్, శివ కేశవ్, రమేష్, ధోని జ్యోతి, పద్మ రాకేష్, శ్రీనివాస్, సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సరఫరాపై జిల్లా కేంద్రంలో సర్వే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వేసవి నేపథ్యంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకి సంబంధించి మున్సిపల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. దీనిలో భాగంగా అధికారులు ఒక ఇంటిని యూనిట్‌గా తీసుకుని దానిలో నీటి సరఫరాకి సంబంధించి వివిధ ప్రశ్నలతో ప్రత్యేక ప్రశ్నావళి తయారు చేసి ప్రజలను సమాచారం సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భుజంగరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో నీటి వినియోగం సరఫరాపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటికి మిషన్ భగీరథ లేదా మున్సిపాలిటీ లేదా బోర్ వెల్ ద్వారా సౌకర్యాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం నీటి ఇబ్బందులు కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగమే సర్వే అన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధికారులు కుమారస్వామి, రమేశ్, శంకర్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్లొద్దు

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల భారీ మొత్తంలో నగదును తమవెంట తీసుకెళ్లొద్దని ఎస్ఐ దీకొండ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని జిల్లా ఎస్పీ, కాగజ్‌నగర్ డీఎస్పీ, కౌటాల సీఐ సూచన మేరకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో వాహనాలను తనిఖీ చేశారు. ఇదే క్రమంలో పెద్దబండ గ్రామానికి చెందిన లెకండె లస్మయ్య అనే వ్యక్తి రూ.4.7 లక్షలు నగదును తీసుకెళ్తున్నాడు. అతని వద్ద నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేని కారణంగా సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీం సభ్యులకు అప్పగించామన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కోడ్ జూన్ వరకు ఉన్నందున ప్రజలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. తమ వెంట పెద్ద మొత్తంలో నగదును తీసుకెళ్లాల్సి వస్తే ఆధారాలు, పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

రైతన్నను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది

• ఎమ్మెల్యే కోవలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆరోపించారు. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్‌తో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన హామీల్లో రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, వడ్లు, మక్కలకు రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామని చెప్పిన ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని తెలిపారు. ఈ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పంటకు మద్దతు ధర ఇస్తామని చెప్పిన బీజేపీ మాట కూడా తప్పిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు కూడా దొందుదొందేనని విమర్శించారు. రైతులకు అండగా ఉండి రానున్న రోజుల్లో మరింత పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, మహిళ సీనియర్ నాయకురాలు సరస్వతి, జెడ్పీటీసీలు అరుణ, ద్రుపద బాయి, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న గోలేటి నాయకులు

రెబ్బెన : బీఆర్ఎస్ పిలుపు మేరకు ఆసిఫాబాద్‌లో రైతుల నిరసన కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఆధ్వర్యంలో రైతు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో గోలేటి బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన విధంగా వరిధాన్యానికి క్వింటాళుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాసరి సాంబగౌడ్, జిల్లా అధ్యక్షులు కుమ్మరి మల్లేష్, మండల మైనార్టీ నాయకులు సయ్యద్ ఆసిఫ్ అలీ, సంతోష్, విశ్వబ్రాహ్మణ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మంగలి కిష్టయ్య, సంతోష్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని నాగుల్వాయి గ్రామానికి చెందిన సెండె నీలయ్య(40) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం ఇంటిలో పురుగుల మందు సేవించిన నీలయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆయనను మెరుగైన వైద్యం కోసం సిర్పూర్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు అర్షద్ హుస్సేన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఎన్నికలు, అటవీ జంతువులపై అవగాహన



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని అటవికి అనుకొని ఉన్న దింద గ్రామంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై శనివారం కౌటాల సీఐ సాదిక్ పాషా, సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్పీ సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరుగకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా పోలీసులకు అందరూ సహకరించాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా వాహనాలు తనిఖీ చేసినంతరం, వాహన దారులకు రోడ్ భద్రతపై అవగాహన కల్పించారు. అంతకు ముందు ఎఫ్ఆర్వో చంద్రమౌళి ఆధ్వర్యంలో నాలుగు రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏనుగును మహారాష్ట్రకే పంపించడం జరిగిందని తెలిపారు. కొంత మంది దిందా పరిసర ప్రాంతాల్లో నిన్న రాత్రి పూట ఏనుగు వచ్చిందని వదంతులు చేశారన్నారు. అటువంటి వాటిని ఎవరుకూడ నమ్మవద్దన్నారు. అటవీ జంతువుల దృష్ట్యా మీకు ఎటువంటి సమాచారమున్న, అటవీ శాఖ అధికారులు సమాచారం ఇవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, పోలీస్, అటవీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ - కౌటాల

మండలకేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి పాల్గొన్నారు. సాయి పల్లకిని ప్రధాన రహదారి మీదుగా మండలకేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారీ మల్లొజ్జుల చంద్రశేఖర్ శర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని సాయిబాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విరబూసిన ఇప్పపూలు

• ఏజెన్సీలో పువ్వు సేకరణ ప్రారంభం • ఉదయమే అడవిబాట పడుతున్న గిరిజనం • గిట్టుబాటు కావడం లేదని ఆదివాసుల్లో అసంతృప్తి • పట్టించుకోని జీసీసీ అధికారులు

అడవి బిడ్డలకు ఉపాధినిచ్చే ఇప్ప పూల సీజన్ మొదలైంది. దీని కోసమే ఎదురుచూస్తున్న గిరిజన, గిరిజనేతర కుటుంబాలు అడవిబాట పడుతున్నాయి. వేకువ జామునే సమీప అటవీ క్షేత్రంలోకి వెళ్లి చెట్టు నుంచి రాలిన ఇప్పపూలను బుట్టల్లో సేకరిస్తున్నాయి. ప్రత్యేక పద్ధతిలో వారం రోజుల పాటు ఎండబెట్టిన తర్వాత గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో విక్రయిస్తారు.



జోడేఘాట్‌లో ఇప్పపువ్వును సేకరిస్తున్న గిరిజన మహిళాలు



ఇప్పపువ్వును సేకరించి తీసుకెళ్తున్న ఆదివాసీ మహిళాలు

నవతెలంగాణ-కెరమెరి

అటవీ ఉత్పత్తుల్లో మార్చి, మే ఇప్ప పువ్వు, సేకరణతో గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. వరి, మక్క, జొన్న, మిర్చి పంటల్లాగే వేసవి కాలంలో ఇప్ప చెట్లు మార్చి, ఏప్రిల్ నెలల్లో పూత, కాతలతో నిండి ఉంటాయి. దీనినే ఇప్ప సీజన్‌గా పిలుస్తారు. ఇది అడవి బిడ్డలకు రెండో పంటగా చెప్పవచ్చు. సహజ సిద్ధంగా దొరికే ఇప్ప పూలు పలు విధాలుగా ఉపయోగపడతాయి. ఈ సమయంలో గిరిజనులు, గిరిజనేతరులు పూల సేకరణలోనే నిమగ్నమవుతారు. వేకువ జామున 3 గంటల నుండి ఉదయం 10 గంటల వరకు పూలు ఏరి, తిరిగి గ్రామాలకు చేరుకొని ఎండబెడతారు. ఇప్ప పూల సేకరణ ప్రారంభమై నెల రోజులు పూర్తైనప్పటికి వాటి కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ ఏడాది కూడా ఏజెన్సీలో ఇప్ప పూలు సేకరణ జీసీసీ ఆధ్వర్యంలో చేపడుతారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేపట్టాలని కోరుతున్నారు.



పలు రకాలుగా వినియోగం

వర్షాకాలంలో ఇప్ప పూలను చిక్కుడు గింజలు, అలసందలతో కలిపి ఉడికించి అంబలి కాస్తారు. ఇప్ప పువ్వు అన్నం వండుతారు. మరికొందరు ఉండలుగా చేసి అల్పాహారంగా స్వీకరిస్తారు. అలాగే వీటిని మందుల తయారీలోనూ వాడతారు. ఈ పూల నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం తదితర వ్యాధులకు ఉపయోగిస్తారు. ఇప్ప బద్దలతో సబ్బులు, ఎరువులు తయారు చేయడంతో పాటు వీటి నుంచి తీసిన నూనెను వంటలతో పాటు దీపారాధనకు వినియోగిస్తారు. మరికొందరు ఇప్ప సారా తయారు చేసుకొని సేవిస్తుంటారు. అదే విధంగా వంటకాలను కూడా తయారు చేసి విక్రయిస్తారు.

దక్కని గిట్టుబాటు ధర

అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో ప్రస్తుతం వీటి సేకరణపై గిరిజనుల ఆసక్తి ఏటా తగ్గుతూ వస్తున్నది. దీంతో అమాయక గిరి ప్రజలు నష్ట పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఇప్ప పువ్వును జీసీసీ ద్వారా కొనుగోలు చేపట్టడం లేదు. అయితే బయట మార్కెట్‌లో కిలోకు రూ.50 చెల్లిస్తున్నారని, తమకు గిట్టుబాటు ధర పెంచి కొనుగోలు చేపట్టాలని గిరిజనులు జీసీసీని అభ్యర్థిస్తున్నారు.

పట్టించుకోని జీసీసీ అధికారులు

ఇప్ప పూల సేకరణపై గిరిజనులకు అవగాహన కార్యక్రమాలు కల్పించడం లేదు. గతేడాది నుండి జీసీసీ కొనుగోలు చేపట్టక పోవడంతో అమాయక గిరిజనులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు తక్కువ ధరలకు ఇప్ప పూలాలను కొనుగోళు చేస్తున్నారు. దీంతో గిట్టుబాటు ధర లభించక ఇప్ప పూల సేకరణకు అనేక మంది ఆసక్తి చూపడం లేదు. ఇకప్పుడు గిరిజనులు ఇప్ప పువ్వు కోసం బారులు తీరువారే, గిట్టుబాటు లేని కారణంగా అడవిబాట పట్టడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైన జీసీసీ ఇప్పపువ్వును కొనుగోళు చేయాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు కాగానే కొనుగోలు ప్రారంభిస్తాం

కోట పాపారావు, జీసీసీ మేనేజర్, ఆసిఫాబాద్



కొనుగోలు కోసం ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఇప్ప పూల కొనుగోలుకు ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఎలాంటి కొనుగోలు ప్రక్రియ మొదలు పెట్టలేదు. అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే జీసీసీల ద్వారా ఇప్ప పూల కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

జీసీసీ ఆధ్వర్యంలో ఇప్ప పూల కొనుగోళ్లు చేపట్టాలి.

పెందూర్ రాజేశ్వర్, గిరిజన సంఘం నాయకుడు, జోడేఘాట్.



గత సంవత్సరం నుండి జీసీసీ ఆధ్వర్యంలో ఇప్పపూలు కొనుగోళ్లు చేయడం లేదు. శ్రమించి సేకరించిన పువ్వుకు గిరిజనులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. నెల రోజులుగా గిరిజనులు ఇప్ప పూలు సేకరిస్తున్నారు. వారికి సరైన గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉంది. దళారులను ఆశ్రయించకముందే ప్రభుత్వం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో మే 13న నిర్వహించే పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పునరుద్ఘాటించారు. ఎన్నికలకు సంబంధించి ఎస్పీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణులతో కలిసి పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫిబ్రవరి 8 వరకు 4,55,437 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరికి 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 597 ఏర్పాటు చేయగా ఇప్పుడు ఆ సంఖ్య 676 పెరిగిందని దీనిలో 47 సమస్యాతక, 22 మావోయిస్టు ప్రభావిత, 56 నెట్వర్క్ లేని పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు వివరించారు. గత అనుభవాల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి ఇబ్బందులు కాకుండా పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ సమయంలోనే ఫామ్-12 ద్వారా దరఖాస్తు తీసుకుంటున్నట్లు తెలిపారు. సదరు ఉద్యోగి జిల్లాలో లేదా వారి సొంత నియోజకవర్గంలో ఓటు వేసే వెసులుబాటు ఉంటుందన్నారు. దీనిని ముందుగానే తెలియజేయాల్సి ఉంటుందని, పోస్టల్ ఉద్యోగులు మే 3 నుండి 8 వరకు ఓటు వేయవచ్చన్నారు. ఓటు వినియోగం రోజు ప్రత్యేక సాధారణ సెలవు దినం వర్తిస్తుందని వివరించారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదులను 1950 లేదా 08733279033 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. ఫామ్-12డి ద్వారా వికలాంగులు వృద్ధులు ఇంటి నుండే ఓటు వేయవచ్చని దీనికోసం ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో 9566 మంది ఉన్నట్లు గుర్తించామని, 40 శాతం కంటే ఎక్కువగా వికలాంగ సర్టిఫికెట్ ఉన్నట్లయితే ఇంటి నుండి ఓటు వేయవచ్చన్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ నెట్వర్క్ లేని పోలింగ్ కేంద్రాలు గతంలో 39 ఉండేవని ప్రస్తుతం 56కు పెరిగాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.9062630 నగదు, 787 లీటర్ల లిక్కర్ దీని విలువ రూ. 3,94,802 ఉంటుందని, 1.05 కిలోల గంజాయితో పాటు, 17 మిక్సర్ గ్రైండర్లు, 43 ఎయిర్ కూలర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రశాంత ఎన్నికల కోసం గ్రామాల్లో పెద్ద ఎత్తున పోలీసులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మండలాల్లో సిఆర్పిఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు.

వేసవి పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. అవసరమైతే తప్ప పగటిపూట ఇంటిలో నుండి బయటకు వెళ్లకూడదని సాధ్యమైనంత ఎక్కువగా నీటిని తీసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పనుల కేంద్రాల్లో అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీతో పాటు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో తాగునీరు ఇబ్బందులు లేకుండా అధికారులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా జిల్లాకు ప్రత్యేక అధికారిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ నీటి ఎద్దడి లేకుండా చూస్తున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నీరు చివరి ఇంటి వరకు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు అలా జరగని పక్షంలో స్థానిక వనరులను ఉపయోగించుకోనున్నట్లు వివరించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు

• కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం పాఠశాలల మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలలున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా వీటిలో మౌలిక వసతులు కల్పన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. పాఠశాలలలో తరగతి గదులు, విద్యుదీకరణ పనులు, మూత్రశాలల మరమ్మత్తులు, మూత్రశాలలకు నీటి సరఫరా సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావడం, తాగునీటి సౌకర్యం, తరగతి గదులలో మరమ్మత్తులు, పైకప్పు, గోడలు, తలుపులు, కిటికీలు ఇతరాత్రా మరమ్మత్తు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాలికల కోసం ప్రత్యేకంగా మూత్రశాలల నిర్మాణం పనులు చేపట్టాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, గ్రామ సమాఖ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పనులు చేపట్టి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాఠశాలలలో మరమ్మత్తు పనులపై అంచనా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారని, కమిటీల సభ్యులు సహకరించాలని సూచించారు. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం పెంచే విధంగా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కొనసాగుతున్న పనులలో ఉపాధి కూలీల హాజరు శాతం పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీడ కోసం షామియానా, తాగునీరు, ఓఆర్ఎస్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వాలు విఫలం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని గోలేటిలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) నూతన బ్రాంచ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌వీసీఎస్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాల జీఓను గెజిట్ చేయడం ద్వారా కార్మికుల వేతనాలు పెరుగుతుందని తెలిపారు. కానీ 2006 నుండి రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలను పెంచకపోవడం వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్మికుల పోరాటాల ఫలితంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఐదు కనీస వేతనాలను విడుదల చేసినా వాటిని గెజిట్ చేయకుండా కాలయాపన చేసిందని ఆరోపించారు. గెలిచిన నెలలోనే జీఓలను గెజిట్ చేసి కార్మికుల వేతనాలు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి నాలుగు నెలలు కావస్తున్నా జీఓలను గెజిట్ చేయకపోవడం లేదన్నారు. వాటి స్థానంలో కొత్త జీఓలను తీసుకొచ్చి కార్మికులు పొందుతున్న ఇప్పటి వేతనాల కంటే తగ్గించే విధంగా జీఓలను తీసుకురావడం అంటే కార్మికులను, వారి శ్రమను అవమానించడమే అవుతుందన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం 2022 జనవరిలో జీఓ గడువు ముగిసిన నేటికి కొత్త జీఓను తీసుకురాకుండా కార్పొరేట్లకు అనుగుణంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఒకవైపు పెరుగుతున్న ధరలు, మరోవైపు పని భారంతో కాంట్రాక్టు కార్మికులు అయోమయానికి గురవుతున్నారన్నారు. కార్మికుల వేతనాలు సరిపోకపోవడం ఆందోళనకు గురిచేస్తున్న అంశమన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జీఓలను విడుదల చేసి గెజిట్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం 2022 సెప్టెంబర్‌లో 18 రోజుల సమ్మె సందర్భంగా చేసిన అగ్రిమెంట్‌లోని అంశాలను 20 శాతం బోనస్, పని ఆధారంగా వేతనాలు పెంచడం, ఈఎస్ఐ సౌకర్యం, ఆర్థిక సెలవులు లాంటివి అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులు ప్రభుత్వాల వైఖరి, సింగరేణి యాజమాన్య నిర్లక్ష్యాలను అర్థం చేసుకొని కార్మికులంతా ఐక్యమై మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఎస్‌వీసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

గోలేటి బ్రాంచ్ నూతన కమిటీ ఎన్నిక...

బ్రాంచ్ అధ్యక్షురాలుగా శారద, కార్యదర్శిగా గొమాస ప్రవీణ్, ఉపాధ్యక్షురాలుగా అనిత, సహాయ కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా ఎస్.జాక్సన్, కమిటీ సభ్యులుగా కె జంగు, శ్రీనివాస్, సీహెచ్ తులసీరాం, రామయ్య, యూసుబ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా బీజేపీ 44వ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో బీజేపీ 44వ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇందాని గ్రామంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాకె విజయ్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా ఎంపీ అభ్యర్థి గెడం నాగేష్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని పథకాలను అందరికి అందించే విధంగా కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలిపించి మూడోసారి నరేంద్రమోడీని ప్రధానమంత్రిని చేయుడానికి అందరు కృషి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్ల పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రావన్, ప్రకాష్, అనిల్, చింటు, బొజ్జీరావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

వేసవి కాలంలో దొంగలతో జాగ్రత్త

నవతెలంగాణ-వేమనపల్లి

వేసవి కాలంలో దొంగలతో జాగ్రత్తగా ఉండాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరిగిన ఎండలు, పిల్లలకు సెలవులుండటంతో యాత్రలకు వెళ్తుంటారని, ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని తెలిపారు. ఊళ్లకు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలని అన్నారు. వేసవిలో కిటికీలు తెరిచి నిద్రిస్తుంటారని, దొంగలు కిటికీల్లోంచి మత్తుమందు చల్లి గాఢ నిద్రలోకి జారుకున్నాక దొంగతనానికి పాల్పడతారన్నారు. రాత్రి సమయాల్లో ఆరుబయట పడుకోవడం దొంగలకు తాళం ఇచ్చినట్టే అవుతుందని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, పెంపుడు కుక్కలను సాకడం ఉత్తమం అని అన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే 100 డయల్ లేదా నీల్వాయి ఎస్ఐ నంబరు 87126 56557కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

తుక్కుగూడ కాంగ్రెస్ సభకు స్థానిక నాయకులు

నవతెలంగాణ-మందమర్రి



తుక్కుగూడ కాంగ్రెస్ బహిరంగ సభకు మందమర్రి నాయకులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేయడం జరుగుతుందని చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లడం జరిగిందని తెలిపారు. ఆరు గ్యారెంటీ పథకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోతు నిలయ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రామ్ చందర్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు గడ్డం రజిని ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-జన్నారం

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో జాతీయ ఉపాధి హామీలో కూలీలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఏఎన్ఎంలు అపరంజి, మాధవిలు అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు పలు సూచనలు సలహాలు చేశారు. వడగాల్పుల వలన వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవడం, వడదెబ్బ లక్షణాలు నివారణ చర్యలు, పలు అంశాలపై వారికి వివరించారు. అనంతరం వారికి ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో కూలీలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు వసంత, రాజమణి, వెంకట్ పంచాయతి సెక్రటరీ రవి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వాతవరణ మార్పుపై ఆర్‌పీలకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

వాతావరణ మార్పు, మానవ ఆరోగ్యంపై జాతీయ కార్యక్రమం లో ఆర్‌పీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మునిసిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా రమేష్ అవగాహన కల్పించారు. ఉదయమే పనులు ముగించుకోవాలని, అత్యవసరం అయినపుడు మాత్రమే బయటకు వెళ్లాలని, తరచుగా నీరు తాగాలని సూచించారు. వడదెబ్బ తగిలినప్పుడు వెంటనే నీడ ప్రదేశంలో చేర్చి దుస్తులు వొదులుగా చేసి గాలి ఆడునట్లు ఉంచి ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలన్నారు. పేషంట్ కోలుకొని యెడల వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వి శ్యాంసుందర్, సిహెచ్ఓ గంగాధర్, ఇన్‌చార్జి టీఎంసీ రఘురాం పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి

- భీమారం మండలంలో పర్యటించిన కలెక్టర్ సంతోష్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో నీటి ఎద్దడిని గుర్తించాలని మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గిన ప్రాంతలను గుర్తించి ఆయా గ్రామ పంచాయతి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. శనివారం భీమారం మండలం ఎల్కేశ్వరం, ఆరెపల్లి, కొత్తపల్లి గ్రామాలను సందర్శించిన కలెక్టర్ బాదావత్ సంతోష్ నీటి సరఫరా తీరు తాగు నీటి సమస్యల పట్ల నేరుగా గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కొత్తపల్లి గ్రామంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున తాగు నీటి ఇబ్బందులు ఉన్నట్లయితే గ్రామస్థులకు ట్యాంకర్ల ద్వార నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఎల్కేశ్వరంలో గ్రామ పంచాయతీ పరిధిలో గల హరితహారం నర్సరీని సంధర్శించిన ఏపుగా పెంచుతున్న మొక్కలను చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమారం ఎంపీడీఓ రాధ రాథోడ్, మండల ప్రత్యేకాధికారి చిన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, ఈసీ శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దుర్భరం

- 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు శనివారం చెన్నూర్ పట్టణంలో రైతులకు మద్దతుగా చేపట్టిన నిరసన దీక్షలో ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు యాసంగి సీజన్ నుంచి రూ. 500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేసిన ఆయన రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ కొనసాగించాలని అన్నారు. ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రుణ మాఫీతో పాటు రైతు భరోసా కింద ప్రతి సీజన్‌కు ముందు ఎకరాకు రూ.7,500 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సీజన్‌లో ఎండిపోయిన పంటలకు రూ.25 వేల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. గడిచిన నాలుగు నెలల్లో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. రైతుల సమస్యలు, ఇబ్బందుల పట్ల స్పందించిన మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట పట్టగా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఉప్పల్ స్టేడియంలో ఎంజాయ్ చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ఉచిత విద్యుత్, సరిపోయినంత సాగు నీరు, మిషన్ కాకతీయ, పంట పెట్టుబడి సాయం పథకాలతో వ్యవసాయం సుభిక్షంగా కొనసాగిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో 209 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు పారదర్శకంగా పని చేయాలని, బీఆర్ఎస్ చేపట్టిన రైతు నిరసన దీక్ష టెంట్ తీసేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.



కొడుకు టికెట్ కోసం ఢిల్లీ చుట్టు చెక్కర్లు

ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తన కొడుకు వంశీకృష్ణకు టికెట్ తెచ్చుకోవడం కోసం ఢీల్లీ చుట్టు చెక్కర్లు కొడుతున్నాడని విమర్శించారు. దీని కోసం వందల కోట్లు ఏఐసీసీ,రేవంత్ రెడ్డికి చెల్లించాడని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనని, ఈ రెండు పార్టీలు జోడి కట్టి ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసులు పెట్టించారని ఆరోపించారు.

పశువులను గాలికుంటు వ్యాధి నుంచి రక్షించుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



రైతులు, పశు పోషకులు తమ పశులను గాలికుంటు వ్యాధి నుంచి రక్షించుకోవాలని, పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్లో జిల్లా పశు సంవర్ధశాఖ సంయుక్త సంచాలకులు వై.రమేష్‌తో కలిసి జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సంబంధిత గోడప్రతులు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వలన తీవ్రమైన జ్వరం, పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, పునరుత్పత్తి, పని సామర్థ్యం తగ్గడం జరుగుతుందని, మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఎక్కువగా ఈ వ్యాధి వస్తుందని, 3 నెలలు పైబడిన అన్ని గోజాతి, గేదెజాతి పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. టీకాలు సురక్షితమైనవని, టీకాలు వేసిన ప్రతి పశువుకు గుర్తింపు చెవిపోగు వేసి వివరాలను భారత్ పశుదాన్ యాప్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, పశు సంవర్ధక శాఖ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌తోనే సింగరేణిలో కారుణ్య నియామకాలు

- యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు రమేశ్



నవతెలంగాణ-నస్పూర్

జాతీయ కార్మిక సంఘాలు కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాలు పోగొడితే టీబీజీకేఎస్ తోనే తిరిగి సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టినట్లు యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు రమేష్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిపై టీబీజీకేఎస్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గడిచిన 10 సంవత్సరాల్లో కారుణ్య నియామకాలతో 20 వేల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని, సింగరేణిలో 43 వేల మంది కార్మికులున్నారంటే తమ యూనియన్ కృషితోనేనని పేర్కొన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో కార్మికులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. టీబీజీకేఎస్ యూనియన్ కోలిండియాలో లేని అనేక హక్కులను సింగరేణి కార్మికులకు సాధించిపెట్టిందన్నారు. టీబీజీకేఎస్‌కు పూర్వవైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి గనుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ నెల 24న గోదావరిఖనిలో జనరల్బాడీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దుర్గయ్య, రాజునాయక్, రాజేశం, గురుమూర్తి, రాజనర్సు, రత్నాకర్‌రెడ్డి, పోషం పాల్గొన్నారు.

అడవిలో కార్చిచ్చు రగలకుండా చూడాలి

నవతెలంగాణ-జైపూర్



మానవుల మనుగడకు ఆధారమైన అడవులను అగ్నికి ఆహూతి కానివొద్దని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సాగరిక అన్నారు. శనివారం మండలంలోని నర్వ గ్రామస్థులకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే జంతు జాతులతో పాటు, విలువైన మొక్కలకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఎండా కాలంలో చెట్ల ఆకులు రాలి ఎండిపోయి ఉన్నందున చిన్న నిప్పు రవ్వ పడితే అది కారు చిచ్చుగా మారుతుందని తెలిపారు. విపరీతంగా మండిపోతున్న ఎండల్లో ప్రమాదం చిన్నదిగా ఉన్నప్పుడే స్పందించాలని, అది పెద్దదైతే మంటలను ఆర్పడం చాల కష్టమవుతుందని తెలిపారు. అడవుల్లో సంచరించే పశువుల కాపర్లు, రోడ్లపై ప్రయాణించే వారు రక్షిత అటవీ ప్రాంతాల్లో బీడీ, సిగరేట్లు తాగి పడవేకుండా ఉండాలని సూచించారు. అడవుల్లో అగ్ని ప్రమాదం జరిగినట్లు గుర్తించిన వెంటనే ఆ ప్రమాదం చిన్నదైతే ఆర్పే ప్రయత్నం చేయాలి, పెద్ద ప్రమాదమైతే వెంటనే సంబంధిత అటవీ అధికారులకు తెలిజేయాలని సూచించారు. అడవులు ఆవాసాలుగా జీవించే పక్షులు, జంతువులు అడవులు కాలిపోతే వాటి మనుగడకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ దీక్ష, టీఏ శృతి, రాములు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్

నవతెలంగాణ-జైపూర్

భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంలో దేశంతో పాటు ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నర్వ గ్రామంలో శనివారం బీజేపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దుర్గం ఎల్లయ్య కామెర లక్ష్మన్, ఆసపెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : శక్తి కేంద్ర ఇన్‌చార్జి వేముల సరస్వతి, పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ కె.సెయింట్ జోసెఫ్ పాఠశాలలో వివిధ బూత్ అధ్యక్షులతో టిఫిన్ బైటక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ ఇన్‌చార్జి రెడ్డా మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ముర్ల పోశం పాల్గొన్నారు.

మందమర్రి : శనివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త కుమారస్వామి ఆధ్వర్యంలో 8,9,17 బూత్‌లలో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీని మూడోసారి ప్రధానిని చేసేందుకు ప్రతీ ఒక్కరు కృత నిశ్చయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కాసిపేట : మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. మండల ఇన్‌చార్జి కేశవరెడ్డి సమక్షంలో ముత్యంపల్లి శక్తి కేంద్రం జెండా ఆవిష్కర చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ బాకీ కిరణ్, మండల ఉపాధ్యక్షులు రెడ్డి బాలరాజు, పెద్దపల్లి శంకర్, నగరారపు ప్రసన్న పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి

- సింగరేణి కబడ్డీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన సీఎండీ



నవతెలంగాణ-జైపూర్

కోల్ ఇండియా స్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు ఇదే విధమైన క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని సింగరేణి సీఎండీ బలరాం నాయక్ కోరారు. ఇంటర్ కంపెనీ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న సింగరేణి జట్టు క్రీడాకారులను శనివారం ఆయన అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సింగరేణి జట్టు ఫైనల్ చేరుకోవడాన్ని అభినందిస్తూ వీడియో కాల్ ద్వారా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫైనల్‌కు చేరుకున్న సింగరేణి జట్టు అదే ఉత్సాహంతో పోటీలో పాల్గొని సింగరేణి సంస్థకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కబడ్డీ క్రీడాకారులను వీడియో కాల్ ద్వారా నేరుగా సీఎండీ బలరాం పలకరించడంతో క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

బైరాన్‌పల్లి సినిమాను ఓటీటీలో ఆదరించండి



నవతెలంగాణ-నస్పూర్

బైరాన్‌పల్లి సినిమాను ఓటీటీలో ఆదరించాలని నిర్మాత ముద్దం నరేష్ వర్మ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నరసింహ చిత్రాలయ సినీ నిర్మాణ సంస్థ నిర్మించిన బైరాన్‌పల్లి సినిమా ప్రమోషన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రం వచ్చిన తర్వాత సినీ పరిశ్రమలో తెలంగాణా యువతకు, కళాకారులకు అవకాశాలు పెరిగాయని పేర్కొన్నారు. గడిచిన 10 సంవత్సరాలల్లో సినీ పరిశ్రమలో ఎక్కువ శాతం మన రాష్ట్రం కళాకారులు పెరిగారని అన్నారు. తాము ఇప్పటి వరకు 4 చిత్రాలు నిరించామని, నూతనంగా తిర్యానీ సినిమా చిత్రీకరిస్తున్నామన్నారు. తమ సినిమాల్లో తెలంగాణా కళాకారులకు ప్రాధాన్యతతో పాటు మన ప్రాంతం కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ ఏరియాల కళాకారులకు, యువతకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. లఘు చిత్రాల్లో కూడా మన ప్రాంతం కళాకారులు అధ్భుతంగా తీస్తున్నారని చెప్పారు. కానీ వారు కూడా వెండితెర సినిమాలుగా లఘు చిత్రాలను ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పూరెళ్ల గురుమూర్తి, దామెర రామ్మూర్తి, గజ్జెల్లీ రాజలింగు, సందేశ్, రహీం పాల్గొన్నారు.

నేటి మహాసభను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించే సింగరేణి ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మిని లింగన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతారని తెలిపారు. అందులో ముఖ్యంగా సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కులు, కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన న్యాయమైన హక్కుల గురించి చర్చించడం జరుగుతుందని మహా సభకు కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు అత్యధిక సంఖ్య లో పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



నవతెలంగాణ-జన్నారం

వేసవి దృశ్య గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి దత్తారం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీలకు చెందిన ప్రత్యేక అధికారులతో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్యలపై, రాబోవు కాలంలో నీటి ఎద్దడి ఏర్పడితే దాన్ని ఎదుర్కోవడానికి ప్రణాళిక రూపొందించేందుకు సమీక్ష చేశారు. ఉపాధి హామీ పథకంలో పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ శశికళ, ఈఓపీఆర్డి రమేష్ ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-జన్నారం

మండలం సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ శశికళ ప్రకటించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో మండల సర్వ సభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 15 మంది ఎంపీటీసీలు ఉండగా, వారిలో ఒకరు మాత్రమే కామన్‌పల్లి ఎంపీటీసీ జునుగురి దుర్గామాదురి మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. వారు వచ్చినా కొంతసేపే ఉండి వెళ్ళిపోయారు. అలాగే పలు శాఖల అధికారులు కూడా హాజరయ్యారు. మళ్లీ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించే తేదీని ప్రకటిస్తామనితెలిపారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
ఆదివారం | ఏప్రిల్ 07, 2024 | www.navatelangana.com

తాండల్లో సేవాలాల్ నామస్మరణ

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని పలు గ్రామాల్లో సేవాలాల్ దీక్షలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సేవాలాల్ దీక్షల్లో భాగంగా శనివారం అనార్‌పల్లి గ్రామంలో జగదాంబ మందిరాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో భోగ్ బండార్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సేవాలాల్ దీక్షలు మహా శివరాత్రి రోజున ప్రారంభమై 41 రోజుల పాటు కొనసాగి శ్రీరామ నవమితో ముగుస్తాయని చెప్పారు. అప్పటి వరకు మద్యం, మాంసానికి దూరంగా ఉంటూ ఉదయం, సాయంత్రం భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాటోత్ రవి, దీక్ష పరులు పాల్గొన్నారు.

టోల్ ప్లాజా చెక్ పోస్ట్ వద్ద రూ.8.81 లక్ష పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద శనివారం సాయంత్రం 5 గంటలకు వాహనాలు తనిఖీలు చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 8 లక్షల 81వేల 300 నగదును పట్టుకున్నట్లు వాంకిడి సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన 13 మంది కారులో ఆసిఫాబాద్ వైపు వెళ్తుండగా వారి నుంచి రూ. 8.81 లక్షలు పట్టుకున్నామన్నారు. సరైన ఆధారాలు లేని కారణంగా నగదును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో లింగాపూర్ ఎస్సై ప్రవీణ్, ఏఎస్సై బాల్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా ప్రణాళికలు రూపొందించాలి

- మండల ప్రత్యేక అధికారి కల్పన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటికి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి కల్పన అధికారులకు సూచించారు.పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంపీఓ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో తాగునీటి సమస్యలపై ప్రణాళికలు రూపొందించేందుకు సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామ పంచాయతీలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని అన్నారు. పరిసర ప్రాంతాల్లో మంచి నీటి బావులను, వ్యవసాయ బావులను, పంపు సెట్లను, వాటర్ ట్యాంక్‌లను వినియోగించి యుద్ధ ప్రాతిపదికన తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో పని ప్రదేశంలో ఓఆర్ఎస్ పాకెట్స్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ గ్రామపంచాయితీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన చంద కిష్టు మృతి చెందంతో శనివారం సీపీఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. వారితోపాటు సిర్ర దేవేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింగ్ రావ్, రైతు సంఘం నాయకులు, ఎస్‌టీయూ నాయకులు నరేందర్ పాల్గొన్నారు.

నేడు ఆధ్యాత్మిక మహాసభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రామచంద్ర మిషన్, హార్ట్ పుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఆదివారం ఆధ్యాత్మిక మహాసభను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు, సంస్థ జోనల్ కోఆర్డినేటర్ కృష్ణారావ్ తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలను వారు వెల్లడించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలోఉదయం 10 గంటలకు ఆరంభం అయ్యే ఈ మాహోత్సవానికి జిల్లాలోని ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థల ప్రతినిధులు, మతపెద్దలు, ఫాస్టర్లు హాజరవుతారని తెలిపారు. ప్రజలు సైతం తరలివచ్చి మంచి విషయాలను తెలుసుకోవాలని సూచించారు. ధ్యానంతోనే శాంతి కలుగుతుందని, సమాజంలోని రుగ్మతలు మటుమాయం అవుతాయని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పోలింగ్, కౌంటింగ్ కవరేజ్ కోసం ఎలక్షన్ కమిషన్ ద్వారా మీడియా పాసులు (అథారిటీ లెటర్స్) పొందనున్న మీడియా ప్రతినిధులకు కూడా ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ తెలిపారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 20 లోపు సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సమర్పించే ఫారం -12 (డీ)లను మాత్రమే పరిగణలోకి తీసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఫారం -12 (డీ) దరఖాస్తులు నోడల్ అధికారి కార్యాలయంతో పాటు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు, డీపీఆర్ఓ కార్యాలయం నుండి కూడా పొందవచ్చని, ఎన్నికల సంఘం పోర్టల్ నుండి సైతం డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత శాసనసభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవీసీ) అందుబాటులో ఉంటుందని, హెల్ప్ డెస్క్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒకసారి పోస్టల్ బ్యాలెట్ కోసం నిర్ణీత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం కల్పించబడదని, ఓటరు జాబితాలో వారి పేరును పోస్టల్ బ్యాలెట్ కింద మార్కింగ్ చేయబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కావున పోస్టల్ బ్యాలెట్ వినియోగించదల్చిన మీడియా ప్రతినిధులు డీ.పీ.ఆర్.ఓ కార్యాలయంను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

రైతుబంధు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన
- రైతులను ఆదుకోవాలని డిమాండ్
- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అన్నదాతలు ఏండ్లుగా ఎదుర్కొంటున్న కష్టాలను దూరం చేసి వారిని అక్కున చేర్చుకున్నామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రవేశపెట్టిన రైతుబంధు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటె తక్షణమే వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద చేపట్టిన దీక్షలో జోగు రామన్న పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలువురు రైతులు, నాయకులు ప్రస్తావించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది...

మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ రైతులకు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమయిందని అన్నారు. రైతుబంధు నగదును రైతుల ఖాతాల్లో ఇప్పటికీ జమ చేయడం లేదని అన్నారు. రైతు కూలీలకు ఆర్థిక సాయం హామీ సంగతేంటని ప్రశ్నించారు. పుష్కలంగా సాగునీరు ఉన్నప్పటికీ వాటి సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దాదాపు ఇరవై వేల ఎకరాల వరి పంట నష్టం జరిగిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పడానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించిన సమయంలో సాగునీరు సరఫరా చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని ఇచ్చిన హామీని సైతం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ జన్మదినం నుంచి అమలు చేస్తామన్న రుణమాఫీ హామీ నాలుగు నెలలైనా అమలు కాలేదన్నారు. పంటలను బోనస్‌తో కొనుగోలు చేస్తామన్న మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా మూడు లక్షల వరకు వడ్డీ లేని పంట రుణాలను మంజూరు చేయాలనీ డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో ప్రత్యేక బడ్జెట్ విధానం అమలు చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం అందించడంతో పాటు 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టి వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు. రైతులకు అన్ని రకాలుగా అన్యాయం చేసిందని అన్నారు. ఈ ధర్నాలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, ఎంపీపీలు మర్శెట్టి గోవర్ధన్, గంద్రత్ రమేష్, నాయకులు యూనుస్ అక్బాని, అలాల్ అజయ్, నర్సింగ్‌రావు, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, నారాయణ, వేణుగోపాల్ యాదవ్, స్వరూప, మమతా, కౌన్సిలర్లతో పాటు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జ్ పాయల శంకర్
- లక్ష 30 వేల ఓట్లే లక్ష్యంగా పనిచేయాలి



నవతెలంగాణ-భైంసా

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని, 10 సంవత్సరాల పాటు ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జ్ ఎమ్మెల్యే పాయల శంకర్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం భైంసాలోని ఎస్ఎస్ కాటన్ ఇండస్ట్రీలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. రాష్ట్రంలో త్వరలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పతనమైందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అదే ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పబ్బం గడుపుతున్నారన్నారు. నాలుగు నెలల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఎంపీ టికెట్ ఆశించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబుకు ఏదైనా కేంద్రంలో నామినేటెడ్ పోస్ట్ ఇప్పించాల్సిందిగా ఆయన విన్నవించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా..

మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్ బాబు తనకు పార్టీ నిర్ణయమే శిరోధార్యమని తనకు టికెట్ రాకపోయినప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని అన్నారు. కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కైవసం చేసుకునేలా కార్యకర్తలంతా కష్టపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజి కుమార్‌రెడ్డితో పాటు జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీపుల్స్ మేనిఫెస్టోలోని విద్యారంగ డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో చేర్చాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీ నారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అఖిల భారత విద్యా హక్కు వేదిక, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మేనిఫెస్టో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ ఫాసిస్టు, కార్పొరేట్ ఏజెండాను ముందుకు తీసుకు వెళ్లెందుకు నూతన విద్యా విదానం 2020 జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్-2023ను తీసుకొచ్చాయన్నారు. ప్రయివేటు సంస్థలకు పూర్తిగా స్వేచ్ఛనిస్తూ, మత విద్యను ప్రోత్సహిస్తూ, విద్యారంగంలో వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణలను వేగవంతం చేయడానికి ఈ విధానాలు తీసుకొచ్చారన్నారు. అలాగే చారిత్రకంగా వివక్షకు గురైన, అణచివేయబడిన వర్గాలు అనుభవిస్తున్న రిజర్వేషన్లను తీసివేయడానికి, ఇప్పుడు అమలులో ఉన్న సీనియారిటీ నియమాలను ఉల్లంఘించటానికి ఈ విధానాలు తోడ్పడతాయన్నారు. నూతన విద్యా విధానం-2020, జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్ వర్క్-2023 లను రద్దు చేయాలని అన్నారు. విద్యా వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణను, హిందూత్వీకరణను వెంటనే ఆపి వేయాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 15శాతం విద్యకు కేటాయించాలని అన్నారు. విద్యా సంస్థలలో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు నింపకుండా కౌన్సిలర్ల పేరుతో పాఠశాలల్లో, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టిస్ పేరుతో యూనివర్సిటీలలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తమ కార్యకర్తలను చొప్పించడాన్ని అడ్డుకోవాలని అన్నారు. విద్యను ఉమ్మడి జాబితా నుంచి తిరిగి రాష్ట్ర జాబితాలోకి తీసుకురావాలని అన్నారు. దేశంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని, విదేశీ విశ్వవిద్యాలయాలను దేశంలో అనుమతించరాదని తెలిపారు. విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లను ఎత్తేసే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రమోషన్లలో సీనియారిటీ విధానాన్ని తీసేసే విధానాన్ని మానుకోవాలన్నారు. చరిత్రను వక్రీకరించడం వెంటనే నిలిపివేయాలని, జ్యోతిష్యం, భూతవైద్యం వంటి అశాస్త్రీయ కోర్సులను ప్రవేశపెట్టడం మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ రాహుల్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, తెలంగాణ స్టూడెంట్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, కార్యదర్శి మీరా రాకేష్, ప్రధాన కార్యదర్శి ఇఫ్తారుద్దీన్, జిల్లా నాయకులు దీపలక్ష్మి, పూజ, అశోక్, దత్తాత్రి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తలనొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ రూరల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అంకత్ మల్లేష్(50) గత సంవత్సరం నుండి తలనొప్పితో బాధపడుతుండడంతో శనివారం ఉదయం గుర్తుతెలియని పురుగుల మందు తాగి పడిపోడంతో వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జరుద్దీన్ తెలిపారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం







నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రపంచ ప్రజాస్వామిక దేశాల్లో అన్నింటికన్నా అతిపెద్ద రాజకీయ పార్టీగా నేడు బీజేపీ ఆవిర్భావించిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. శనివారం బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహానుభావుల నేతృత్వంలో పనిచేయడం తన అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు లాలా మున్నా, అంకత్ రమేష్, గందె కృష్ణ, ఆకుల ప్రవీణ్, జోగు రవి, సోమ రవి, కృష్ణ యాదవ్, వేదవ్యాస్, ధోని జ్యోతి, రాజేష్, శ్రీనివాస్, శివ, రఘుపతి, సతీష్, భీమ్‌సేన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతాని కృషి

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. శనివారం బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పట్టణంలోని కైలాస్ నగర్ కాలనిలో బూత్ కమిటీల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు సుహాసినిరెడ్డి నివాసంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి కమిటీ అధ్యక్షులు రాకేష్, బూత్ కమిటీ అధ్యక్షులు హరీష్, అనిల్, రమేష్, పార్టీ సీనియర్ నాయకులు గందే విజయ్ కుమార్, నారాయణరెడ్డి, నితిన్ పటేల్, విలాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి, మహిళా నాయకురాలు కాంత, అనిత, నాయకులు పవన్, ప్రవీణ్ అగర్వాల్, రాహుల్, అనిల్, రాజు, నరేష్, దీపక్ సింగ్ ఉన్నారు.

ఇంద్రవెల్లి : బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం స్థానిక బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్, శ్యామ్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అర్క పుష్పలత, అరెల్లి రాజలింగం మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలో తేవడమే మన లక్ష్యమన్నారు. దాని కోసం బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమ్‌రావ్, కేంద్రే బాలాజీ, శివకుమార్, సంతోష్, దీపక్ సింగ్, దిలీప్ మోరే పాల్గొన్నారు.

ఖానాపూర్‌టౌన్ : పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బీజేపీ నాయకులు తెలంగాణ చౌక్‌లో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హరినాయక్, మహేష్, డి. మల్లయ్య, ఎం.సురేష్, గోపాల్‌రెడ్డి, మట్టేరి శేఖర్, కె.సంతోష్, సుధాకర్, సాయన్న, మురళి, శ్రీధర్, పరమేశ్వర్ గౌడ్, ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిచారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి, ఇంటింటికి చేరేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మళ్లీ నరేంద్రమోడీని ప్రధానిగా బాధ్యతలు చేపట్టేలా మనమదరం కృషి చేద్దామన్నారు. బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దిలావర్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు శైలేశ్వర్, సర్పంచ్ వీరేష్ కుమార్, బోజరాం పటేల్, ఉమాశంకర్, రాజు, సాయినాథ్, అనీల్, శ్రీకాంత్, సాయిరాం, గంగాధర్, మధు, నరేష్ పాల్గొన్నారు.

బేల : మండల కేంద్రంలో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జండా ఆవిష్కరించారు. టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని బూత్ అధ్యక్షులు, శక్తి కమిటీ అధ్యక్షులు మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. మరో సారి మోడీ ప్రధానమంత్రి లక్ష్యంగా పని చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీ రాక్రే, మండల అధ్యక్షులు దత్తా నిక్కం, నాయకులు గణేష్ బోనగిరివార్, శివకుమార్, కృష్ణ, బోడుకుంట రాకేష్, ప్రదీప్ ఖోడే, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, రాము, కుండలిక్, బీజేవైఎం మండల అధ్యక్షులు పోతురాజ్ నవీన్ పాల్గొన్నారు.



భైంసా : మండలంలోని దేగామలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భైంసా మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సిరం సుష్మరెడ్డి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ హయంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాష్ పటేల్, నాయకులు చంద్రకాంత్ పటేల్, కిష్టయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉట్నూర్ : బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6న డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన భారతీయ జనసంఘ్‌ను భారతీయ జనతా పార్టీగా నామకరణం చేశారు. భారతదేశపు బంగారు భవిష్యత్తుకు అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణా అద్వాని బంగారు బాటలు వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, జాతీయ నాయకులు శ్రీరామ్ నాయక్, మండల అధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, కోకన్వీనర్ గడ్డం నందిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్, సాడిగే రాజేశ్వర్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి బొడ్డు కిరణ్, తన్నీరు సతీష్, రమణ, శ్రీకాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మధూకర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామాల్లో బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్, గణపురం నాగేష్, సంతోష్, లాస్కర్ వెంకటేశ్వర్, సాయిబాబు, మల్లేష్, శంకర్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కూడా హాజరయ్యారు. అనంతరం వీరు కార్యకర్తలతో కలిసి టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మరోసారి బీజేపీ అధికారం చేజిక్కించుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, నాయకులు ముత్తు అశోక్, వీరభద్రచారి, చేరాల శ్రీనివాస్, అనిల్, శ్రీనివాస్, మధూకర్, కొండ తిరుపతి, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.